www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 28 నవంబర్ 2025



పెండింగ్ వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప రిమ్స్, జిజిహెచ్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని కొత్తగా ఈగల్ కంపెనీ చూస్తున్నారని తెలిపారు. సెక్యూరిటీకి వేతనాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కొత్త ఏజెన్సీ ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా కట్టి, పెండింగ్‌లోఉన్న దాదాపు మూడు నెలల వేతనాలు ఇవ్వాలని తెలిపారు. ఈ విషయాలన్నిటిపైన జిల్లా అధికారులు, జిజిహెచ్ అధికారులు దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. మేనేజ్‌మెంట్ వెంటనే స్పందించి వేతనాలు వేయాలని తెలిపారు.

గృహ నిర్మాణం.. లక్ష్యానికి దూరం

6,200 పెండింగ్ గృహాలపై ఆగ్రహం

18 మంది ఎఇ, ఎఇఇలకు వార్నింగ్

కాంట్రాక్టర్లకు నోటీసులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని అసంపూర్తి పక్కాగృహాలపై ఉన్నత స్థాయిలో కదలిక వచ్చింది. రాష్ట్ర హౌసింగ్ ఉన్నతాధికారులు నిర్వహించిన సమీక్షలో జిల్లాలోని అసంపూర్తి పక్కాగృహాలపై సీరియస్‌గా చర్చించినట్లు సమాచారం. హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ బాబు జిల్లాలోని పక్కాగృహాల డీవియేషన్‌పై దృష్టి సారించారు. జిల్లాలో పెండింగ్ పక్కాగృహాలపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. జిల్లాలోని 1.14 లక్షల పక్కాగృహాల నిర్మాణ లక్ష్యంలో భాగంగా బిబిఎల్, ఎన్ఎస్-2 వంటి కేటగిరీల పరిధిలోని పక్కాగృహాలను తొలగించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం 1.0 కింద జిల్లా హౌసింగ్ యంత్రాంగం 89 వేలు పక్కాగృహాల నిర్మాణాలు చేపట్టింది. ఇందులో 40 వేలు పక్కాగృహాలు పూర్తి కాగా, 20 వేలు పక్కా గృహాలు బేస్‌మెంట్, 10 వేల పక్కాగృహాల రూఫ్ లెవెల్, ఐదు వేల గృహాలు వివిధ దశల్లో ఉన్నట్లు తేలింది. హౌసింగ్ కమిషనర్ నిర్వహించిన సమీక్షలో తేలిన 16 వేలు పక్కా గృహాలను పరిశీలనే చేయాలని ఆదేశించారు. 10 వేలు పక్కా గృహాలను మినహాయిస్తే మిగిలిన 6,200 పక్కాగృహాలు డీవియేషన్‌లో ఉన్నట్లు సమాచారం. 3,200 డోర్‌ఫ్రేమ్, విండో ఫ్రేమ్, సుమారు 3 వేలు ఫిల్లింగ్ వంటి కేటగిరీలు అసంపూర్తి ఉన్నాయని



బేష్‌మట్టానికే పరిమితమైన గృహ నిర్మాణం

తేలింది. మేనేజింగ్ డైరెక్టర్ స్పందించి బాధ్యులైన తొమ్మిది మంది హౌసింగ్ ఎఇ, తొమ్మిది మంది అసిస్టెంట్ ఇంజినీర్లపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎఇ, అసిస్టెంట్ ఇంజినీర్ల జీతాలు ఆపేయాలని ఆదేశాలు జారీ చేయడంపై విమర్శలు రావడంతో వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఈనెలాఖరు నాటికి డీవియేషన్‌లోని పక్కాగృహాలను పూర్తి చేయడానికి అవకాశం ఇచ్చినట్లు తెలుస్తోంది. జిల్లా హౌసింగ్ ఇంజినీరింగ్ యంత్రాంగం సంబంధిత హౌసింగ్ కాంట్రాక్టర్లపై ఆర్ఆర్ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేస్తామని పేర్కొంటూ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. డీవియేషన్ విభాగంలో 6,200 పక్కా గృహాలకు నిధులు విడుదల చేయకుండా ఇళ్లను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడంలోని ఆంతర్యమేమిటో ఎవరికీ అర్థం కాని వ్యవహారంగా మారింది.

ధైర్యంగా ఉండండి వచ్చేది మన ప్రభుత్వమే

- సమస్యలపై పోరాటం చేద్దాం

- నాయకులతో వై.ఎస్.జగన్

ప్రజాశక్తి -పులివెందుల టౌన్

వచ్చేది మన ప్రభుత్వమేనని అందరూ ధైర్యంగా ఉండాలని, సమస్యలపై పోరాటం చేస్తామని మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకులకు, కార్యకర్తలకు తెలిపారు. పులివెందుల మూడు రోజుల పర్యటన భాగంగా మూడో రోజు గురువారం పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వైసిపి ముఖ్య నాయకులు కలిసి ప్రస్తుత నియోజకవర్గంలోని సమస్యల గురించి ఆయనకు వివరించారు. దీనికి ఆయన స్పందిస్తూ 2029లో మనమే అధికారంలోకి వస్తామని ఆయన తెలిపారు. గ్రామాలలో కూటమి నాయకులు చేస్తున్న ఆగడాలకు ఎవరు భయపడకూడదని ప్రతి ఒక్కరికి అండగా ఉంటానన్నారు. కార్యకర్తలకు ధైర్యాన్ని నింపి పార్టీని బలోపేతం చేయాలని ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉండి అన్ని విధాల ఆదుకుంటామన్నారు. **వైసిపి శ్రేణుల్లో జోష్...** వైఎస్ జగన్మోహన్ రెడ్డి మూడు రోజుల పర్యటనలో భాగంగా వైసిపి శ్రేణులలో జోష్ నింపింది. ఎన్నడూ లేని విధంగా ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ఓపిగ్గా వారి సమస్యలు వింటూ తాను ఉన్నానంటూ ధైర్యాన్ని నింపారు. నిరుత్సాహం, అధైర్యంతో ఉన్న నాయకులు, కార్యకర్తలకు భరోసా ఇచారు. అధైర్య పడకుండా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ పార్టీని బలోపేతంకి కృషి చేయాలని పేర్కొన్నారు. **ముగిసిన వైఎస్ జగన్ పర్యటన,,** పులివెందుల మూడు రోజుల పర్యటన గురువారం ముగిసింది. మొదటిరోజు ప్రజాదర్బార్ నిర్వహించి నాయకులు, కార్యకర్తలు, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రెండో రోజు అరటి తోటలను పరిశీలించి కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రైతు పక్షాన పోరాటాలు చేస్తామని వెల్లడించారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే ఇటీవల మరణించిన వైసిపి నాయకుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. 3వరోజు ప్రజాదర్బార్ ఏర్పాటు చేసి ఉదయం 9:30 గంటలకు హెలికాప్టర్ ద్వారా బెంగళూరుకి వెళ్లారు. కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి, వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ వీడ్కోలు పలికారు.



జగన్‌కు వీడ్కోలు పలుకుతున్న కడప ఎంపీ, ఎమ్మెల్యేలు, వైసిపి జిల్లా నాయకులు

ఆధారిత పంటలకు అధిక ప్రాధాన్యత



పంటల సాగుపై రైతులకు సూచనలిస్తున్న జెడి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం ఆధారిత పంటలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు వ్యవసాయ శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు చంద్రానాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కత్తులూరులో రైతన్న మీకోసం కార్యక్రమం చేపట్టారు. ఆయన రైతులను కలిసి వ్యవసాయ శాఖకు సంబంధించిన పథకాలను తెలియజేశారు. ఈ సందర్భంగా జెడి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ రైతులను లాభాల బాట నడిపిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయం రంగంలో ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర జిఎస్‌టిలో 35 శాతం వరకు వాటా అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి రైతూ ఏక పంట కాకుండా బహుళ పంటలు సాగు చేయడం ద్వారా రైతులకు అధిక లాభం వచ్చే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివశంకరరెడ్డి, పట్టు పరిశ్రమ అధికారి,పశుసంవర్ధక శాఖ అధికారులు, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు రైతులు పాల్గొన్నారు. **చాపాడు :** రైతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని డ్వామా పీడీ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఆది శేషారెడ్డి తెలిపారు. గురువారం మండల వ్యవసాయ అధికారి దేవి పద్మలతతో కలిసి అల్లాడుపల్లె గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ వ్యవసాయ సహాయకులు, సచివాలయ సిబ్బంది గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి పంచ సూత్రాలు, నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వీర కిషోర్ , పంచాయతీ కార్యదర్శి లక్ష్మి ప్రసన్న, విఐఎ విమత, విఆర్ఒ రాజ్ కుమార్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** మండలంలోని రాగిమానుపల్లెలో గురువారం రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు.ముఖ్య అతిథులుగా పులివెందుల మండల ప్రత్యేక అధికారి పి రమాదేవి , మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి హాజరయ్యారు. మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ రైతులు పండించే వివిధ రకాల పంటల ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించడం ప్రాధాన్యతగా తీసుకుందని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి, రైతులు, వ్యవసాయ అసిస్టెంట్ శివ ప్రసన్న, ఐసిడిఎస్ సూపర్ వైజర్ మాబున్ని పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** ప్రతి రైతూ ప్రధానమంత్రి పసల్ బీమా ఇన్సూరెన్స్ చేసుకోవాలని తెలుగుయువత మండల అధ్యక్షులు రాచుమల్ల సుధీర్ కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం పెద్దముడియం మండల పరిధిలోని పాలూరులో రైతన్నకు మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండిచిన పంటలకు కనీస మద్దతు ధర లభించాలంటే ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. రబీలో సాగు చేసిన పంటలకి పంటల బీమా ప్రీమియం మీ సేవా కేంద్రాల్లో చెల్లించి పంట నష్టపోయినపుడు లబ్ధిపొందవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల ఎఒ జాకీర్ షరీఫ్, రైతుసేవాకేంద్ర సహాయకులు, గ్రామ నాయకులు ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కుమారస్వామిరెడ్డి, రాచుమల్ల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బాలసుబ్బారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ రోల్స్ ఎస్ఐఆర్ పనులు వేగవంతం : జెసి

ప్రజాశక్తి - కడప

జిల్లాలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్(ఎస్ఐఆర్-2025) కార్యక్రమాలు వేగవంతంగా నిర్వహిస్తున్నామని జెసి అదితిసింగ్ రాష్ట్ర ఎన్నికల అధికారి పేర్కొన్నారు. గురువారం ఉదయం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఎన్నికలకు సంబంధించి ఇఆర్‌ఒలు, బిఎల్‌ఒల నియామకం, బిఎల్ఒ ఐడి కార్డుల పంపిణీ, కొత్త పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వంటి అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ విసి కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జెసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారితో జిల్లా వివరాలు తెలియజేశారు. ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు, బిఎల్‌ఒలు, బిఎల్ఒ సూపర్‌వైజర్లకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రకారం మ్యాపింగ్‌చేయడంపై జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశామని చెప్పారు. ఎస్ఐఆర్-2025ఎస్ ప్రకారం జిల్లాలోని 16,48,315 మంది ఓటర్లను మ్యాపింగ్ చేసే ప్రక్రియలో భాగంగా ఇప్పటి వరకు 3,34,154 మంది ఓటర్లను మ్యాపింగ్ చేశామని చెప్పారు. బిఎల్ఒ ఐడి కార్డుల ప్రింటింగ్, పంపిణీకి సంబంధించి జిల్లాలో మొత్తం 1963 బిఎల్‌ఒల వివరాలను ఇప్పటికే అప్డేట్ చేసి విధులను కూడా కేటాయించి 1874 మంది కార్డుల పంపిణీ పూర్తి చేశామని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు ఇఆర్ఒ మార్పునకు సంబంధించిన ప్రతిపాదనను పంపించామని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 1963 పోలింగ్ స్టేషన్లు ఉండగా రేషనలైజేషన్ తర్వాత 2121 పోలింగ్ కేంద్రాల పెంపు దలకు ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు. అం దుకు సంబంధించి కొత్తగా 158 అదనపు పోలింగ్ కేంద్రాలకు 120 మంది బిఎల్‌ఒల నియామకం కోసం కూడా ప్రతిపాదనలు పంపామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, ఆర్‌డిఒలు, ఎన్నికల సంబంధి తాధికారులు హాజరయ్యారు.



విసిలో మాట్లాడుతున్న జెసి అదితిసింగ్

ప్రాధాన్యత మేరకు అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయాలి : ప్రభుత్వం చేపడుతున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యత క్రమంలో లక్ష్యం మేరకు పూర్తి చేయాలని జెసి అధితి సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుంచి వరి ధాన్యం కొనుగోలు, మహిళలపై నేర నియంత్రణ, గంజాయి, మత్తు పదార్థాల నివారణ, సానుకూల ప్రజా దృక్పథం, జిఎస్ డబ్ల్యుఎస్ , మున్సిపల్ సేవలు - పారిశుధ్య చర్యలు, ఆర్‌టిజిఎస్, సంక్షేమ శాఖ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జెసి హాజరయ్యారు. సిఎస్ విసి ముగిసిన అనంతరం సంబందిత అధికారులతో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సంబందిత శాఖల అధికారులు ఆయా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కెఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, సంబందిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'డిజిటల్' కేసులో 9 మంది అరెస్టు

- నగదు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం

- ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్ వెల్లడి

ప్రజాశక్తి కడప అర్బన్

పులివెందులలో డిజిటల్ అరెస్టు కేసు నమోదులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి, నగదు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. గురువారం పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశంరెడ్డి అనే వ్యక్తిని నిందితులు డిజిటల్ అరెస్ట్ పేరుతో భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. రూ. 1.62,83 కోట్ల నగదు ప్రకాశం రెడ్డి నుంచి వేయించుకున్నారని చెప్పారు. ఈ కేసులో నిందితులు చిక్క రాజు మధు, ఆదిత్య మనోహర్, అర్జున్, రోషన్ ఉల్లాస్, సురేష్, హరీష్ శ్రీనివాస్‌ను గురువారం పోలీసులు తలుపుల క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేశారని పేర్కొన్నారు. కేసులో మరికొందరిని పట్టుకోవాల్సి ఉందని తెలిపారు. కేసును త్వరితగతిన పూర్తిచేసిన పులివెందుల డిఎస్‌పి మురళి, సిఐ సీతారామిరెడ్డి, ఎస్ఐ సుబహాన్, సైబర్ క్రైమ్ సిఐ మధుసూదన్‌రెడ్డిని అభినందించారు. డిజిటల్ అరెస్టుల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పోలీసులు డిజిటల్ అరెస్టులు ఎప్పుడూ చేయరని ప్రజలు గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి సచికేత్ విశ్వనాథ్



ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, బాధితులు



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రహమతుల్లా

ప్రయివేట్ వైద్యుల నిర్లక్ష్యం.. శిశువు మృతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



సుఖంగా ప్రసవం చేయాల్సిన వైద్యులు తమ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పసిప్రాణం బలి అయిన సంఘటన గురువారం పట్టణంలో చేసుకుంది. ఇందుకు నిరసనగా సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, మున్సిపల్ కార్మిక సంఘ కార్యదర్శి సాల్మన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమృత నగర్‌కు చెందిన సుమలత గర్భం దాల్చి సుఖ ప్రసవం కోసం స్థానిక హర్ష ఆసుపత్రిలో ప్రతినెలా చూపించుకుంటున్నారని పేర్కొన్నారు. గర్భంలో శిశువు క్షేమంగా ఉందని డాక్టర్ సమిత చెప్తూ వచ్చారని చెప్పారు. మూడు రోజుల కిందట ప్రసవం కోసమని ఆసుపత్రిలో సుమలత చేరారని చెప్పారు. ఆస్పత్రిలోని నర్సులు సుఖ ప్రసవం చేయక పోవడంతో అనారోగ్యంతో శిశువు పుట్టిందన్నారు. పైగా మెరుగైన వైద్యం కోసం కడపకు తీసుకెళ్లాలని సలహా ఇచ్చారని తెలిపారు. కడపలో శిశువు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందిందన్నారు. మూడు రోజుల కిందట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు.

కడిగిన ముత్యం మా నాయకుడు

- ఎన్ఆర్ఐ టిడిపి కువైట్ ఉపాధ్యక్షులు రహమతుల్లా

ప్రజాశక్తి - కడప అర్బన్


ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఫైబర్ నెట్ కేసులో కడిగిన ముత్యంలా బయటికి వచ్చారని ఎన్ఆర్ఐ టిడిపి కువైట్ ఉపాధ్యక్షులు రహమతుల్లా పేర్కొన్నారు. గురువారం ఎసిబి న్యాయస్థానం కేసులు మూసివేయడంతో కడప ఎన్ఆర్ఐ టిడిపి కార్యాలయం ఎదుట బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రహమతుల్లా మాట్లాడుతూ ఫైబర్ నెట్ అవినీతి, అక్రమాలు చేశారని గత వైసిపి ప్రభుత్వంలో 2023 సంవత్సరంలో నారా చంద్రబాబు నాయుడుపై తప్పుడు ఆరోపణలు చేస్తూ అక్రమంగా కేసు పెటికట అరెస్టు చేసి అన్యాయంగా జైల్లో ఉంచారని పేర్కొన్నారు. ఎటువంటి తప్పు చేయని చంద్రబాబు నాయుడుపై ఉన్న అక్రమ ఫైబర్ నెట్ కేసును విచారణ జరిపిన ఎసిబి న్యాయస్థానం ఎటువంటి అవినీతి, అక్రమాలు, ఎలాంటి ఆర్థిక నష్టం చోటు చేసుకోలేదని ఈ కేసును మూసేశారని తెలిపారు. ఇందులో న్యాయం గెలిచిందని పేర్కొన్నారు. అసత్య ఆరోపణలు, తప్పుడు కేసులు పెట్టడం వైసిపి నాయకులు ఇకనైనా మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, బిసి సెల్ టిడిపి సీనియర్ నాయకులు చంద్రశేఖర్, టిఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు అనిల్, నాయకులు ఇర్ఫాన్,షేక్ నిజాం, ఎస్సీ సెల్ నగర ఉపాధ్యక్షుడు వంకేల ఆనందరావు, సీనియర్ నాయకులు గుడిపాటి గోపీనాథ్ పాల్గొన్నారు.

హోలిస్టిక్ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సేవలు

- ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ మోహన్‌రావు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని హోలిస్టిక్ ఆస్పత్రిలో గుండె సంబంధిత సమస్యలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఇంటర్వెన్షనల్ డాక్టర్ రామనాథన్, ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ మోహన్‌రావు తెలిపారు. గురువారం వారు సిబ్బందితో కలిసి మీడియాతో మాట్లాడారు. నెలరోజులుగా కొత్త టెక్నాలజీతో కూడిన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. సాధారణంగా గుండె సమస్యకు సంబంధించి యాంజోప్లాస్టీ చేస్తారన్నారు. శరీరంలో క్యాల్షియం ఉన్నట్లయితే యాంజీ ప్లాస్టీ చేయడం కుదరదన్నారు. ఈ విషయంగా క్యాల్షియాన్ని గుర్తించేందుకు టెక్నాలజీకి అనుగుణంగా వివిధ రకాల పద్ధతులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. తమ ఆస్పత్రిలో ఐవస్ పద్దతిలో క్యాల్షియాన్ని గుర్తించి దానిని బ్రేక్ డౌన్ చేసేందుకు ఇంట్రావ్యాక్సో లిట్రో థెరపీ బెలూన్ వాడి పొసిజర్ విజయవంతం చేస్తామన్నారు. తాజాగా ఓ బాధితుడికి ఈ విధానాన్ని విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రజలు దూర ప్రాంతాల్లోని నగరాలకు వెళ్లకుండా స్థానికంగా తమ ఆస్పత్రిలో లభిస్తున్న వైద్య సేవలను తక్కువ ఖర్చుతో చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో హోలిస్టిక్ ఆస్పత్రి సిఇఒ శరత్ బాబు, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

బతికి ఉండగానే మహిళకు డెత్ సర్టిఫికెట్


ప్రజాశక్తి - కలసపాడు

ఓ మహిళ బతికుండగానే డెత్ సర్టిఫికెట్ మంజూరైంది. ఈ సంఘటన కలసపాడు మండలంలోని దూలవారిపల్లెలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి అనే మహిళకు బతికుండగానే ఆమె భర్త మరణ ధృవీకరణ సర్టిఫికెట్‌ను కొరియర్‌లో పంపించాడు. ఆమె భర్త మారుతిరాజు రోజూ తాగొచ్చి వేధింపులకు గురిచేస్తుండడంతో 15 రోజుల కిందట ముద్దనూరు నుంచి పుట్టింటికి వచ్చింది. గురువారం పొన్నా ఆదిలక్ష్మి పేరుతో డెత్ సర్టిఫికెట్‌ను భర్త కొరియర్ ద్వారా ఆమెకు పంపాడు. బతికి ఉండగా డెత్ సర్టిఫికెట్ పంపిన విషయం తెలుసుకున్న పలువురు ఆశ్చర్యానికి గురయ్యారు.

జాతీయ హాకీ జట్టుకు సాయిమోహన్ ఎంపిక

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్ విద్యార్థి సాయి మోహన్ 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బాలుర విభాగంలో జాతీయ జట్టుకు ఎంపికై రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్య వహించనున్నాడు. ఈనెల 20 నుంచి 24 వరకు వైజాగ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో సాయిమోహన్ చక్కటి ప్రతిభ కనబరచడంతో జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. త్వరలో రాజస్థాన్‌లో నిర్వహించే జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు గంధం సురేంద్ర పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

అడ్వెంచర్ క్యాంపులు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి

ప్రజాశక్తి - కడప

అడ్వెంచర్ క్యాంపులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్.జి.రవీంద్రనాథ్ అన్నారు. ఈ నెల 10 నుంచి 21 వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జాతీయస్థాయిలో నిర్వహించబడిన రాక్ క్లైమింగ్ క్యాంపులో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని ప్రతిభ కనబరచిన ఎన్‌సిసి కేడెట్లు బిఎస్‌సి కంప్యూటర్స్ సైన్స్ విద్యార్థి సయ్యద్ అలీ, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థి మహమ్మద్‌లను కళాశాలలోని ప్రిన్సిపల్ ఛాంబర్‌లో అభినందించారు. ఎన్‌సిసి అధికారి కెప్టెన్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ విద్యార్థులు అడ్వెంచర్ కాంపుల్లో పాల్గొనడం ద్వారా ఒత్తిళ్ల ఎదుర్కొనే సామర్థ్యం పెంపొందడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ మహేష్, ఐక్యు ఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, కేడెట్లు పాల్గొన్నారు.




విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

వైవీయూలో పీజీ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ తృతీయ సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. 450 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కాగా 40 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కె.ఎస్.వి.కృష్ణారావు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని సిఇ తెలిపారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ కాత్యాయని మార్గదర్శకంలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అబ్జర్వర్ డాక్టర్ కె.మృత్యుం జయరావు పర్యవేక్షించారు. పరీక్షలు నిర్వహణలో అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ ముని కుమారి, సిబ్బంది చంద్రమౌళి ఉన్నారు.



పరీక్షలను పర్యవేక్షిస్తున్న ప్రొఫెసర్

ఉద్యోగుల పట్ల ప్రభుత్వ తీరు సరికాదు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరికాదని యుటిఎఫ్ కడప జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు విమర్శించారు. గురువారం సాయంత్రం ప్రొద్దుటూరులోని స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ పాఠశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలనిచ్చిందని, ఆ హామీలు నిజమని నమ్మి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకరిస్తే ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పూర్తిగా విస్మరిస్తుందని ఆరోపించారు. గత వైసిపి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల కక్షపూరితంగా వ్యవహరించిందని, ఆర్థిక బకాయిలను చెల్లించకుండా వేధింపులకు గురిచేసిందని, రివర్స్ పిఆర్‌సిని అమలు చేసి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసిందని, తమది ఫ్రెండ్లీ ప్రభుత్వం అని పేర్కొంటూనే గత వైసిపి ప్రభుత్వ బాటలోనే కూటమి ప్రభుత్వం సైతం నడుస్తున్నదని ఆరోపించారు. 12వ పిఆర్‌సి గడువు ముగిసి రెండేళ్లు దాటినా కనీసం ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగులకు మెరుగైన వేతనాలు అమలు చేస్తామన్న హామీని కూటమి పెద్దలు మరిచిపోయారని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు డిఎలు చెల్లించాల్సి ఉండగా కేవలం ఒక డిఎ చెల్లింపుతో సరిపెట్టడం తగదన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే ఆరు మాసాలలోగా బకాయిలన్నింటినీ చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని వారు నిలదీశారు. ఉద్యోగులకు మూడేళ్లుగా సరెండర్ లీవ్ చెల్లింపులు లేవన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేస్తామని పదేపదే ప్రకటనలు చేస్తూ, మరోపక్క ఉపాధ్యాయులను నిరంతరం బోధనేతర కార్యక్రమాలలో భాగస్వాములను చేయడం తగదన్నారు. 25 ఏళ్ల పైబడి బోధనలో అనుభవం ఉన్న ఉపాధ్యాయులను ఇప్పుడు టెట్ పరీక్ష రాయమనటం సహేతుకంగా లేదన్నారు. ఉపాధ్యాయుల్లో నెలకొని ఉన్న ఆందోళనను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని, అవసరమైతే విద్యాహక్కు చట్టాన్ని పార్లమెంటులో సవరించేందుకు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడకపోతే ఉపాధ్యాయులను కూడగట్టి పోరాటాలకు సన్నద్ధమవుతామని వారు హెచ్చరించారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డి.రవీంద్రుడు, ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షులు గంగాధర్, ప్రొద్దుటూరు రూరల్ అధ్యక్షులు ఎస్.ఫయాజుద్దీన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాదన విజయ్‌కుమార్



విద్యార్థిని చేతిలో వెలిగే కర్పూరం ఉంచి ట్రిక్కును వివరిస్తున్న జెవివి నాయకులు

ప్రగతికి మూలం ప్రశ్నించేతత్వం : జెవివి

ప్రజాశక్తి -ఎర్రగుంట్ల

ప్రతి విద్యార్థి ప్రశ్నించడం నేర్చుకోవాలని, ప్రగతికి మూలం ప్రశ్న అని జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు బాలబయన్న విద్యార్థులకు సూచించారు. జనవిజ్ఞాన వేదిక మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక శిక్షణ కేంద్రంలో గురువారం 'సైన్సు- సమాజం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబయన్న మాట్లాడుతూ ఇది సైన్స్ యుగం అని మానవుడి సకల జీవన రంగాన్ని సైన్స్ శాసిస్తోందని వివరించారు. ప్రయోగశాలలో శాస్త్రవేత్తలు మాత్రమే సమాజాన్ని సైన్సు యుగంలోకి మళ్లించలేరని, సైన్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని మార్పును కోరుకోవాలన్నారు. విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన వస్తే నిత్యజీవితంలో సాధారణ వస్తువులలో సైన్స్ సూత్రాలను చూసి, చేసేందుకు ప్రయత్నం చేయాలన్నారు. సమాజానికి మూఢనమ్మకాల ప్రభావంతో కలిగే నష్టాలను వివరించారు. సైన్స్ మ్యాజిక్‌లు చేసే దాని వెనక ఉన్న మర్మాన్ని తెలియజేస్తూ విద్యార్థుల చేత చేయించారు. కార్యక్రమంలో జెవివి మండల గౌరవాధ్యక్షులు కె.వి.సుబ్బయ్య, మండల ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్‌రెడ్డి, శిక్షణ సంస్థ సిబ్బంది ఆశోక్, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాజీ సిఎం జగన్‌తో వల్లంబాయి హృషీకేశవరెడ్డి

కష్టపడి పనిచేసే వారికి అండగా ఉంటా

ప్రజాశక్తి - జమ్మలమడుగు

వైసిపిలో కష్టపడి పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు ఎప్పుడు తాను, పార్టీ అండగా ఉంటుందని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా నేతలతో చెప్పారు. వైసిపి మున్సిపల్ విభాగం అధ్యక్షులు వల్లంబాయి హృషీకేశవరెడ్డి తెలిపారు. గురువారం జిల్లా నేతలతో జిల్లా రాజకీయాలపై సుదీర్ఘమైన చర్చ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2029 ఎన్నికలలో కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి కలిసికట్టుగా ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారన్నారు. గ్రామస్థాయి నుండి ఉన్న కమిటీలను బలోపేతం చేసేందుకు కృషిచేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీని కాచుకొని కార్యకర్తలకు అండగా ఉన్నవారికి వచ్చే మన ప్రభుత్వంలో మీరే చూస్తారని తెలిపారన్నారు. అన్యాయానికి గురవుతున్న ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారన్నారు. కార్యక్రమంలో ఎంపీ. వై.ఎస్. అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అమర్ నాథ్ రెడ్డి, జమ్మలమడుగు పార్టీ సమన్వయ కర్త, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి, సతీష్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న బసిరెడ్డి రవీంద్రారెడ్డి

సాగునీరు అందించడమే లక్ష్యం : 'బసిరెడ్డి'

ప్రజాశక్తి-కాశినాయన

మండలంలో రైతులకు, ప్రజలకు సాగు, తాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గంగనపల్లి గ్రామ సమీపంలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు బద్వేల్ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి ఆదేశాల మేరకు బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో 100 కె.వి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వ హించి నీటిని విడుదల చేశారు. రవీంద్రారెడ్డి మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద విద్యుత్ సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. రైతులు అధైర్య పడవద్దు అని చెరువులకు పూర్తి స్థాయి లో నీరు నింపుతామని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ మంజూరులో జాప్యం తగదు


ప్రజాశక్తి -కాశినాయన : ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు పెన్షన్ సౌలభ్యాలు జ్యాపం లేకుండా మంజూరు చేయాలని ఎస్‌టియు జిల్లా ఆర్థిక కార్యదర్శి యు.సుబ్రహ్మణ్యం కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కొంతమంది ఎయిడెడ్ ఉపాధ్యాయులు రిటైర్డ్ అయి రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ, వారికి రావాల్సిన హాఫ్ పే లీవ్, ఎన్ క్యాష్‌మెంట్ అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. కావున ప్రభుత్వం ఎయిడెడ్ ఉపాధ్యాయుల హెడ్‌ఆఫ్ అకౌంట్స్‌ను కూడా పరిగణలోకి తీసుకొని త్వరితగతిన వారికి పెన్షన్ సౌలభ్యాలను అందించాలని, గత ఏడాదిన్నర కాలం నుండి గ్రాట్యుటీ అమౌంటు విడుదల చేయకపోవడం వల్ల రిటైర్డ్ అయిన ఉద్యోగ ఉపాధ్యాయుల లక్షలాది రూపాయలు సరైన సమయంలో అందక ఇబ్బందులకు లోనవుతారు. వారికి రావాల్సిన గ్రాడ్యుటీ బెనిఫిట్స్ కూడా త్వరితగతిన ప్రభుత్వం చెల్లించి ఆ కుటుంబాల్లో వెలుగులు నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - చాపాడు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వనిపెంట రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకున్నది. పోలీసుల అందించిన వివరాల ప్రకారం.. మృతుడు స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన మునగల వెంకటసుబ్బయ్య (56) అని తెలిపారు. సైకిల్‌పై వెళ్తున్న వెంకటసుబ్బయ్యను గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సిఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో ఆరు గొర్రెలు మృతి

ప్రజాశక్తి - చక్రాయపేట



మండలంలోని యర్రగుడితాండలో కుక్కలు దాడి చేయడంతో ఆరు గొర్రెలు మృతి చెందినట్లు బాధితుడు బుక్యే గాంగే నాయక్ తెలిపారు. గురువారం సాయంత్రం గొర్రెలు మేపుకుని వాటిని దొడ్డిలో తోలాడు. ఆ సమయంలో కుక్కలు దొడ్డిలోని కుక్కల వద్దకు వెళ్లి వాటిపై దాడి చేయడంతో ఆరు గొర్రెలు మృతిచెందాయి. గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడంతో గొర్రెలు మృతి చెందినట్లు బాధితుడు వాపోయాడు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల దాడి నుంచి గొర్రెలను కాపాడాలని, ఆర్థికంగా నష్టపోయిన తనకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మహిళలకు అన్ని రంగాల్లో సమానహక్కు : ఎంపిడిఒ



మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీధర్

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

లింగ సమానత్వంపై మైదుకూరు పట్టణంలో మండల సమాఖ్య కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యాక్రమనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు మాట్లాడుతూ తల్లితండ్రుల ప్రోత్సహంతో ఆడపిల్లలు ఎన్నో అద్భుతాలు సృష్టిస్తున్నారన్నారు. అందుకు తమిళనాడులోని కబడి ప్లేయర్ కావ్య ఇందుకు నిదర్శనం అని అన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో సమాన హక్కులు కల్పిస్తున్నామని చెప్పారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రూరల్ సి.ఐ రమణారెడ్డి మాట్లాడుతూ ఈనెల 15 నుంచి డిసెంబర్ 15 వరకూ ఉమెన్ సేఫ్టీకి సంబంధించి ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తామన్నారు. హెల్ప్ లైన్ నంబర్స్ అయిన 181,1098,112లను వినియోగించుకోవాలని తెలిపారు. భ్రూణ హత్యలు తగ్గించాలని, పుట్టిన పిల్లల్ని చెత్తకుప్పలో పడివేయడం తగ్గేలా చూడాలన్నారు. బాల, బాలికలను ధీటుగా పెంచాలని, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడపిల్ల పుట్టినప్పటి నుంచి వివాహం వరకు ప్రభుత్వమే భరిస్తుందన్న విషయాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి, ప్రశాంతి అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ జయరాజు,ఎస్ ఐ సుబ్బారావు, సిసిలు, వగంగిరెడ్డి, లెనిన్ చంద్రారెడ్డి, కళావతి, రసూల్, అకౌంటెంట్ రెడ్డమ్మ, గ్రామసమాఖ్య సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : సమాజంలో లింగ సమానత్వం సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపిడిఒ వెంకట రమణయ్య పిలుపునిచ్చారు. గురువారం చిలంకూరు గ్రామంలో జాతీయ ప్రచారం-జెండర్ సమానత్వం కోసం కార్యక్రమాన్ని ఎంపిడిఒ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెండర్ వివక్షతకు వ్యతిరేకంగా అవగాహన కల్పించారు. ఎక్కడైనా వివక్ష కనిపిస్తే స్థానికులు సామాజిక బాధ్యతగా వ్యవహరించి అధికారులకు తెలియజేయాలన్నారు. గ్రామంలో ఈ కార్యక్రమం గురించి వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎం జగదీశ్వరి, పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు. అలాగే ఎంపిడిఒ వెంకటరమణయ్య ఆధ్వర్యంలో నిడిజీవి గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు నీటి భద్రత, ధాన్యం కొనుగోలు, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు వంటి వాటిపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి

వైద్య వృత్తి పవిత్రమైంది

ప్రజాశక్తి -చింతకొమ్మదిన్నె

వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని కడప జిల్లా టిడిపి అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. గురువారం ముక్తియార్ నర్సింగ్ కళాశాలలోని బిపిసి, ఎంఎల్‌టి, బిఎస్‌సి నర్సింగ్ విద్యార్థులకు ప్రెషర్స్‌డే మండల పరిధిలోని రాజా రాణి కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి టిడిపి జిల్లా అధ్యక్షులు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో మన దగ్గరికి వచ్చే వారిని ఆప్యాయంగా ప్రేమతో పలకరించి మాట్లాడితే సగం జబ్బు వాటితోనే నయమవుతుందని చెప్పారు. మిగతా సగం మందులతో బాగవుతుందని తెలిపారు. వృద్ధాప్యంలో ఉన్న వారి పట్ల ప్రేమ అనురాగాలు చూపించి వారికి మరింత చేరువ కావాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడాల్సిన అవసరం ఉండదని చెప్పారు.అవసరం ఉండదన్నారు. అనంతరం ముక్తి యార్ విద్యాసంస్థల అధినేత, రాష్ట్ర ముస్లిం షేక్ షేక్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ ముక్తియార్ మాట్లాడుతూ వైద్య వృత్తికున్న ప్రాముఖ్యత దేనికీ లేదని తెలిపారు. ఇష్టపడి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి ఇటు తమ ఆశలను తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆయన కోరారు. తమ కళాశాలలో ఎటువంటి ర్యాగింగ్ లేవు అని చెప్పారు. విద్యార్థులకు కావలసిన అన్ని సౌకర్యాలను కళాశాల యాజమాన్యం సమకూరుస్తుందన్నారు. తమ కళాశాల అగ్రగామిగా నిలుస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, పాటల పోటీలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గోవర్ధన్ రెడ్డి, కరస్పాండెంట్ ఆలీ అక్సర్, డైరెక్టర్ హుస్సేన్‌బాషా పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పీలేరు

డిసెంబర్ 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి ఎ.మహేష్ తెలిపారు. గురువారం స్థానిక కోర్టులో ఇన్సూరెన్స్ అధికారులు, న్యాయవాదులతో న్యాయమూర్తి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మోటారు వాహన కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న కేసులు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. సమావేశంలో పలువురు న్యాయవాదులు, ఇన్సూరెన్స్ అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుల జ్ఞానసంపద యువతకు ఆదర్శం

ప్రజాశక్తి-పీలేరు

కుటుంబంలో వృద్ధులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మనం మన ఆరోగ్యాన్ని జాగ్రత్తపరచుకోవడమేనని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శ్రీగిరీష తెలిపారు. గురువారం మండలంలోని జాండ్ల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ఆరోగ్య సేవల కార్యక్రమాన్ని నిర్వహించి మధుమేహం, రక్తపోటు, మాతృ సేవలు, సాధారణ వ్యాధిగ్రస్తులకు వ్యాధినిర్ధారణ పరీక్షలు, చికిత్సలు నెలకు సరిపడ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ జీవితంలో ప్రతి ఒక్కరికి వృద్ధాప్యం సహజమని, ఇదో రెండో బాల్య దాస్య అని, జ్ఞాపక శక్తి తగ్గడం, నిద్రలేమి, కుంగుబాటు వంటి సమస్యలు ఎదురవుతాయని, వాటిని నిర్లక్ష్యం చేయకుండా ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మనం మన ఆరోగ్యాన్నీ కాపాడుకుంటూ కుటుంబ మన్నలను పొందాలని, మీరు ఒంటరి కాదు మీకు అండగా ఆరోగ్య సేవలు వున్నాయని వృద్ధులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఇఒ కొండయ్య, ఎఎన్ఎం కృష్ణమ్మ, సిహెచ్ఒ లావణ్య, డిఇఒ సుధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్‌పిటిసి కొగటం వెంకట బయపురెడ్డి

మండలాభివృద్ధికి సహకరించాలి : ఎంపిపి

ప్రజాశక్తి - వేముల

మండలాభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపిపి చల్లా గంగాదేవి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వేముల జడ్‌పిటిసి కొగటం వెంకటబయపురెడ్డి హాజరయ్యారు. అన్ని శాఖలపై ఆయా అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంగా మండల కేంద్రంలో తాగునీరు సమస్య తలెత్తకుండా పరిష్కరించాలని బయపురెడ్డి పేర్కొన్నారు. అలాగే మండల కేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించి ప్రమాదాలను సంబంధితాధికారులు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సతీష్ కుమార్,వ ండల ఉపాధ్యక్షులు నర్సింహారెడ్డి, లీలావతి, ఎంపిటిసిలు బాబ్జాన్, లక్ష్మీదేవి, కో - ఆప్షన్ సభ్యులు మండి మాపీర, ఓబులేసు, అబ్దుల్లా, రమేష్‌రెడ్డి, శశికళ, అఫ్రిన్, పద్మావతి, సర్పంచ్‌లు చెన్నారెడ్డి, నిర్మల, అర్జున్, శ్రీనివాసులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎఐసిసి అబ్జర్వర్ కన్యాకుమారి పార్లమెంట్ సభ్యులు విజయ్ వసంత్ తెలిపారు. సంఘటన్ సుజన్ అభియాన్ కమిటీ మైదుకూరు షాధిఖానాలో కాంగ్రెస్ పార్టీ మైదుకూరు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ రామ సుధాకం రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం సరైన నాయకత్వం కలిగిన డిసిసి అధ్యక్షులను ఎన్నుకోవడానికి సంఘటన్ సుజన్ అభియాన్ కమిటీ జిల్లాకు వచ్చిందన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి సరైన నాయకత్వాన్ని ఎన్నుకుంటామన్నారు కమిటీలో ఎపిసిసి నుండి లీగల్ చైర్మన్ సోమశేఖర్, ఉపాధ్యక్షులు నరసింహులు ఉన్నారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి, డిసిసి మాజీ అధ్యక్షులు జి .శ్రీరాములు మండలాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫైలేరియా సర్వే

ప్రజాశక్తి - గోపవరం

గోపవరం పిహెచ్‌సి పరిధిలోని బ్రాహ్మణపల్లె, బేతయపల్లెల్లో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు రెండు రోజుల పాటు ఫైలేరియా సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటిలో రక్తపూతలు సేకరించారు. ఒక్కో గ్రామంలో 300 నమూనాలు తీసుకున్నారు. ఫ్రైడే డ్రైడే పాటించి దోమల లార్వాను నిర్మూలించాలని, వేపాకు పొగతో దోమలను దూరం ఉంచవచ్చని వైద్యాధికారి డాక్టర్ బి. మురళీకృష్ణ తెలియజేశారు. క్యూలెక్స్ దోమ వల్ల ఫైలేరియా వ్యాపిస్తుందని, పరిశుభ్రతతో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా నివారించవచ్చని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



రక్తపూతలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది



రాజును సన్మానిస్తున్న కరస్పాండెంట్

విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకోవాలి

- కరస్పాండెంట్ బి.ఎస్.రమణారెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు బాగా చదువుకుని దేశానికి ఉపయోగపడే గొప్ప పౌరులుగా తయారు కావడంతో పాటు విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని ఉషాకిరణ్ పాఠశాల కరస్పాండెంట్ బి.ఎస్. రమణారెడ్డి పేర్కొన్నారు. కరస్పాండెంట్ పుట్టిన రోజును పురస్కరించుకొని గురువారం పులివెందులకు చెందిన స్నేహిత అమృత హస్తం సేవా సమితి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు మొమ్మెల రాజుకు స్వచ్ఛంద సేవా సంస్థ భవన నిర్మాణం కోసం రూ.25వేల నగదును అందజేశారు. స్నేహిత అమృత హస్తం సేవా సమితి రక్తం అవసరమైన వారికి రక్తాన్ని సేకరించడంలోనూ, పేద విద్యార్థులకు ఎపిఆర్‌జెసి పాలిసెట్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వడం హర్షణీయం అని అన్నారు. కోవిడ్ లాంటి విపత్తుల వేళ తన టీం సహాయంతో సేవలు అందించడంలోనూ రాజు విశేష కృషి చేశారని కొనియాడారు. అనంతరం అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజును దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సతీమణి విజయలక్ష్మి, గుజ్జుల కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - ముద్దనూరు

రైతుల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు. మంగపట్నం గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ ఎడిఎ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి రైతన్న మీకోసం రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమనికి భూపేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ప్రభుత్వం రైతన్నలకు ప్రాధాన్యత నిచ్చిందన్నారు. అన్నదాత సుఖీభవ, పిఎంకిసాన్ పథకాల ద్వారా రైతులకు చేయూత నిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని చెప్పారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి రైతన్న మీ కోసం కర పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలోఎంపిడిఒ రాధాకృష్ణవేణి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ నాగరాజు, మండల అధ్యక్షులు శివరామిరెడ్డి, నాయకులు జగదీశ్ కుమార్ రెడ్డి, చంద్ర శేఖర్ నాయుడు, కేశవ రెడ్డి, చంద్రఓబులరెడ్డి, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ఎంపీ రమేష్‌కు ప్రముఖుల పరామర్శ

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

మండలంలోని పొట్లదుర్తి గ్రామంలో అనకాపల్లి ఎంపీ సి.ఎం. రమేష్ నాయుడు తల్లి చింతకుంట రత్నమ్మ (83) బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. అనారోగ్యం కారణంగా ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం పోట్లదుర్తిలో శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్ బాబు, పుత్తా చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు కెవిపి రామచంద్రరావు, వల్లభనేని వంశీ అంతక్రియలకు హాజరై నివాళులర్పించారు. ప్రొద్దుటూరు రోడ్డులో పెన్నానది సమీపంలో గల వారి శ్మశానంలో రమేష్ దగ్గరుండి తన తల్లి పార్థీవదేహానికి దహన సంస్కారాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున స్థానికులు పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు, కెవిపి రామచంద్ర రావు పాల్గొన్నారు.



టిడిపి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

ఒంటిమిట్ట అభివృద్ధికి కట్టుబడి ఉన్నా: 'చమర్తి'

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట ప్రాంత అభివృద్ధికి టిడిపి కట్టుబడి ఉందని, మొన్నటి జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో ప్రజలు ఆదరించినట్లుగానే, రాబోయే అన్ని ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. గురువారం ఒంటిమిట్ట మండలంలో తెలుగు తమ్ముళ్ళతో కలిసి అట్టహాసంగా నూతన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని చమర్తి జగన్మోహన్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గం 6 మండల కేంద్రాల్లో తెలుగుదేశం పార్టీ కార్యాలయాల్లో ప్రజలకు నాయకులు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట టిడిపి మండల అధ్యక్షులు గజ్జల నరసింహా రెడ్డి, జడ్‌పిటిసి ముద్దుకృష్ణారెడ్డి, క్లాస్ వన్ కాంట్రాక్టర్ కరెంటు రమణ, బొబ్బిలి రాయుడు, ఎ. వెంకట సుబ్బయ్య, కె.సుబ్బరాయుడు, సాలాబాద్ బుజ్జి, ఎం.వి రమణ, టి.ఈశ్వరయ్య, జి.శ్రీనివాసరెడ్డి, మౌలాలి, నరసింహులు, సురేష్ రాజు, రాజశేఖర్ యాదవ్, మల్లేష్ యాదవ్,తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి నాయకులు గతంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని నిరుపేదల భూములు, స్థలాలు అన్యాక్రాంతాలు చేశారని రాజంపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు తెలిపారు. మండల కేంద్రమైన సిద్ధవటం, ఎగువపేట పోలీస్ లైన్ క్రాస్ వద్ద టిడిపి మండల నూతన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు ఆయనకు మండల టిడిపి నేతలు డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికి మాలలు వేశారు. పార్టీ వ్యవస్థాపకుడు కీర్తిశేషులు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ బోర్డు చైర్మన్ సి.కె. చౌదరి రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, మండల టిడిపి అధ్యక్షులు రాజశేఖర్, క్లస్టర్ ఇన్‌ఛార్జి రాజా నాయుడు మాజీ జడ్‌పిటిసి సభ్యుడు చలమయ్య, పార్లమెంటు కార్యదర్శి నాగ మునిరెడ్డి, అసెంబ్లీ బిసి సెల్ అధ్యక్షులు చెంచయ్యానాయుడు, అసెంబ్లీ రైతు విభాగపు ప్రధాన కార్యదర్శి, మల్లు వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులు, జ్యోతి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

టిడిపితోనే బిసిల అభివృద్ధి

ప్రజాశక్తి -పోరుమామిళ్ల : టిడిపితోనే బిసిల అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ మండల నాయకులు తుపాకుల ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని బిసిలందరూ తెలుగుదేశం పార్టీని అభివృద్ధి చేయడానికి కృషి చేయాలన్నారు. బడుగు, బలహీన వర్గాల పార్టీ తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు. రాబోవు స్థానిక ఎన్నికలలో ప్రతి గ్రామంలోని సర్పంచ్‌ను, ఎంపిటిసిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇల్లు లేని నిరుపేదలు దరఖాసు చేసుకుంటే మంజూరు చేయిస్తామని ఆయన తెలిపారు.